క్లుప్తంగా

నిరంతర కార్యక్రమాలతో చక్కటి అవగాహన



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట : వైద్య విద్యా కార్యక్రమాలు తరచూ నిర్వహించడం వల్ల నూతన అంశాలపై అవగాహన కలుగుతుందని ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు అన్నారు. ఆదివారం ఆంధ్ర వైద్య కళాశాలలో అబ్‌స్ట్రాక్ట్ ఎనస్తీషియా అనే అంశంపై జరిగిన నిరంతర వైద్య విద్యా సదస్సును ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వైద్య విధానం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎనస్తీషియా సొసైటీ ఆఫ్ ఇండియా పూర్వ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కుచేలబాబు, ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ప్రశాంత, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ అచ్యుతరామయ్య, పరిశీలకురాలు డాక్టర్ శిల్ప, వైద్యులు అల్లు పద్మజ, వి.రవి, 220 మంది ఎనస్తీషియన్లు పాల్గొన్నారు.

వైద్య, రక్తదాన శిబిరాలకు విశేష స్పందన



రక్తదానం చేసిన యువతకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం: జ్ఞానాపురం మెయిన్‌రోడ్డులో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్, మెడికవర్ ఆసుపత్రి, రోటరీ బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన మెగా రక్తదానం, వైద్య శిబిరాలను వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ప్రారంభించారు. సుమారు 46 మంది యువత పాల్గొని రక్తదానం చేశారు. సెయింట్ జోసెఫ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, యువత చేస్తున్న సేవా కార్యక్రమాలను కార్పొరేటర్ పూర్ణిమ అభినందించారు. కార్యక్రమంలో రోటరీ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ అశోక్, కో–ఆర్డినేటర్ మాణిక్యం, రమేష్, వైఎస్సార్‌సీపీ వార్డు వర్కింగ్ ప్రెసిడెంట్ వేళంగిణిరావు, సచివాలయ కన్వీనర్లు ఈశ్వరి, దేవి, అన్నపూర్ణ, చుక్క శ్యామ్ సుందర్‌రెడ్డి, కల్యాణ్, రమేష్, చిన్న గవర రమణ, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం విగ్రహావిష్కరణలో నగర నాయకులు



విగ్రహావిష్కరణలో పాల్గొన్న నగర నాయకులు

డాబాగార్డెన్స్: మాజీ ముఖ్యమంత్రి బీపీ మండల విగ్రహావిష్కరణ ఆదివారం గుంటూరులో జరిగింది. విగ్రహావిష్కరణలో కార్యక్రమ కన్వీనర్ జంగా కృష్ణమూర్తి, జస్టిస్ ఈశ్వరయ్యతో పాటు సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులు కొట్టాల రాము, రామన్న పాత్రుడు, ఇన్‌చార్జి రమణబాబు, అనకాపల్లి జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పిల్లల శంకర్, గాజువాక పట్టణ అధ్యక్షుడు చెల్లిబోయిన సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవం

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు తిక్కవానిపాలెం కాలనీలోని సంపత్ వినాయక పార్వతీ విశ్వేశ్వర ఆలయ 23వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ గౌరవ అధ్యక్షుడు గరికిన పరసియ్య, అధ్యక్షుడు మేడ గురప్ప వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. అన్ని పార్టీల స్థానిక నాయకులు, భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

ఆలయాలకు శివరాత్రి శోభ



అచ్చియ్యమ్మపేట చినదుర్గాలమ్మ అమ్మవారు



నీలమ్మవేపచెట్టు అమ్మవారు



పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ అమ్మవారు



ముస్తాబవుతున్న నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవాలయం

- 18న నీలమ్మ వేపచెట్టు అమ్మవారి ఉత్సవం
- 19న దుర్గాలమ్మ ఉత్సవం
- ముస్తాబవుతున్న దేవాలయాలు

అల్లిపురం: నియోజకవర్గంలో శివరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఈ మేరకు ఇప్పటికే సంబంధిత దేవాలయ కమిటీలు, అధికారులు సన్నాహాలు పూర్తి చేశారు. వారితో పాటు భక్తులు కూడా ఎవరికి వారు అమ్మవార్ల ఘటాలు తీసుకువచ్చి పూజలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భక్తులు మాలలు ధరించి ఉదయం, సాయంత్రం పూజలు నిర్వహిస్తున్నారు.

18న నీలమ్మ వేపచెట్టు అమ్మవారి జాతర

అస్సాంగార్డెన్స్‌లో వెలసిన శ్రీ నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానంలో మహాశివరాత్రి వార్షిక జాతర మహోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో రఘుమండ శ్రీహరి తెలిపారు. 17వ తేదీ శుక్రవారం అమ్మవారి తొలేళ్ల ఉత్సవం సందర్భంగా తెల్లవారి 6 గంటల నుంచి అమ్మవారికి పంచామృతాభిషేకాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి అనంతరం కుంకుమ పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటల నుంచి అమ్మవారి తిరువీధి ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం అమ్మవారి మాలధారులు అగ్నిగుండ ప్రవేశం చేయనున్నారు. 18వ తేదీన ప్రధాన జాతర ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి క్షీరాభిషేకం, కుంకుమ పూజల అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించనున్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

19న దుర్గాలమ్మ అమ్మవారి వార్షిక మహోత్సవం

పూర్ణామార్కెట్ దరి దుర్గాలమ్మ అమ్మవారి వార్షిక శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నెల 18వ తేదీన అమ్మవారి తొలేళ్ల ఉత్సవం అత్యంత వైభవంగా చేపట్టనున్నట్లు ఆలయ సిబ్బంది తెలిపారు. శుక్రవారం తెల్లవారు జాము 5 గంటల నుంచి అమ్మవారికి కుంకుమార్చనలు, శూలాల పండగ, భక్తుల అగ్నిగుండం ఉంటుందని తెలిపారు. రాత్రి 12 గంటలకు అమ్మవారి నేత్రోత్సవం అనంతరం తొలిపూజ అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. 2వ తేదీన అమ్మవారి జాతర మహోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 3 గంటల నుంచి అమ్మవారి దర్శనాలు కల్పించనున్నారు. భక్తులు ఘటాలతో వచ్చి అమ్మవారిని దర్శించుకోనున్నారు.

అచ్చియ్యమ్మపేట చిన దుర్గాలమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు

అచ్చియ్యమ్మపేటలో గల చినదుర్గాలమ్మ అమ్మవారి వార్షిక శివరాత్రి ఉత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. 18న తొలేళ్ల ఉత్సవంలో భాగంగా తిరువీధి ఉత్సవం, అగ్నిగుండం ఉంటుందని తెలిపారు. 19న ప్రధాన జాతర నిర్వహిస్తామని తెలిపారు.

దుర్గాలమ్మ జాతర మహోత్సవాలు ప్రారంభం

- పలు రకాల అలంకరణల్లో దర్శనమివ్వనున్న అమ్మవారు
- 26న 5 వేల మంది భక్తులకు మహాన్నదానం



నాగవల్లీ దళార్చన (తమలపాకులు)లో దుర్గాలమ్మ అమ్మవారు



ఆలయ ప్రాంగణంలో జరిగిన పిల్లల కూచిపూడి నృత్యం

డాబాగార్డెన్స్: నగరంలోని పూర్ణామార్కెట్ వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ వార్షిక జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 19వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. అమ్మవారిని వివిధ రీతుల్లో అలంకరించనున్నారు. ఈ నెల 18న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని నాగవల్లీ దళార్చన (తమలపాకులతో)అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా 19న అమ్మవారి జాతర మహోత్సవం జరగనుంది. ఈ నెల 26న మారువారాన్ని పురస్కరించుకుని అష్టోత్తర శత పదార్థ నివేదన (108 రకాల వంటకాలతో అమ్మవారికి నివేదన అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టనున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 5 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నాట్యదీపిక అకాడమీ విద్యార్థులు కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఇంద్రాణిరెడ్డి నేతృత్వంలో పిల్లలు చేపట్టిన కూచిపూడి భక్తులను ఆకట్టుకుంది.

అమ్మవారి స్థల పురాణం..

దుర్గాలమ్మ దేవాలయం 1851వ సంవత్సరంలో కొండే గణపతిరావుచే నిర్మించినట్లు వసంతరావు రామకృష్ణారావుచే రాయబడిన విశాఖపట్నం దేవాలయం గ్రంథం నుంచి తెలుస్తోంది. అమ్మవారి దేవాలయం అప్పట్లో చిన్నదిగా ఉండేది. దేవస్థానం నిధులు, దాతల విరాళాలతో ఆలయాన్ని పున: నిర్మించారు. ఈ దేవాలయంలో ప్రతి సంవత్సరం ఆశ్వీయుజ శుద్ధ పాఢ్యమి నుంచి విజయదశమి వరకు శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటారు. ముక్కోటి ఏకాదశి రోజున అమ్మవారికి లక్ష కుంకుమార్చన, శివరాత్రి మరుసటి రోజున అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలు నిర్వహించడం ఆనాదిగా వస్తోంది. జాతర మహోత్సవాల్లో భాగంగా భక్తులు భవానీ మాలలు ధరించి అమ్మవారిని భక్తితో సేవిస్తారు.

అయిన వారు వద్దనుకున్నారు

- మనసున్న వారు ఆదుకున్నారు
- ఒంటరి వృద్ధుడికి మమత చారిటబుల్ ట్రస్ట్ చేయూత



పెందుర్తి లయోలా వృద్ధాశ్రమంలో వృద్ధుడు

అల్లిపురం : నేటి తరం పిల్లలకు వృద్ధులైన తల్లిదండ్రులు భారమవుతున్నారు. వారిని వదిలించుకునేందుకు రోడ్లపై వదిలిపెట్టి చేతులు దులిపేసుకుంటున్నారు. అలాంటి ఒక వృద్ధుడిని కడుపున పుట్టిన వారో, బంధువులో తెలియదు రోడ్డు మీద వదిలి వెళ్లిపోవటంతో అతను తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. అతన్ని ఎవరో తీసుకువచ్చి మధురవాడ పీహెచ్‌సీ వద్ద బయట వదిలిపెట్టి పోవటంతో బొబ్బిలిలోని సీతారాంపురం గ్రామానికి చెందిన జగన్నాథం గత మూడు రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ఎవరైనా ఎవరి కోసం చూస్తున్నావని అడిగితే తనను ఎవరో తీసుకువచ్చి వదిలేసారని, తనకు ఎక్కడైనా ఆశ్రయం కల్పించాలని వేడుకుంటున్నాడు. దీంతో ఎవరో వాట్సాప్‌లో రికార్డు చేసి సోషల్ మీడియాలో పెట్టారు. దీంతో విషయం తెలుసుకున్న మమత చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మమత పీఎం పాలెం పోలీసుల సహకారంతో ఆ వృద్ధుడి వివరాలు తెలుసుకున్నారు. అతనికి కళ్లు కనపడకపోవటంతో ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. అతనికి పెందుర్తి లయోలా ఓల్డేజ్ హోమ్‌లో ఆశ్రయం కల్పించారు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు ఓల్డేజ్ హోంలో సంప్రదించాలని తెలిపారు.

ఖగోళశాస్త్రం-మానవ వికాసంపై సదస్సు

డాబాగార్డెన్స్: ఖగోళశాస్త్రం-మానవ వికాసంపై జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి నిర్వహించిన సదస్సులో జన విజ్ఞాన వేదిక నాయకులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఇస్రో నుంచి ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ మూర్తి రేమెళ్ల, ఐఐటీ చెన్నై నుంచి ప్రొఫెసర్ డాక్టర్ వి. శ్రీనివాస చక్రవర్తి, వరంగల్ నిట్ నుంచి ప్రొఫెసర్ ఎ. రామచంద్రయ్య, ప్రముఖ హేతువాది పెనుమత్స సుబ్బరాజు పాల్గొని ఖగోళశాస్త్రం, మానవ వికాసంపై మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, స్కాలర్లు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం



దీక్షలో పాల్గొన్న వికలాంగులు

సీతమ్మధార: ప్రభుత్వ రంగ సంస్థలు లక్షలాది మందికి ఉద్యోగం, ఉపాధి కల్పించడమే కాకుండా ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ప్రజలకు అండగా నిలుస్తున్నాయని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభ అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన దీక్షలు 681వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రజలకు సేవలందిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం కాకుండా రక్షించుకుంటామని అన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు అమ్మేయాలని చూడడం అవివేకమన్నారు. కార్పొరేటీకరణ విధానాలు అమలు చేసిన ఏ దేశం అభివృద్ధి సాధించలేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలను విడనాడాలని హెచ్చరించారు. విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అని.. అటువంటి సంస్థను ప్రైవేటీకరించాలని చూస్తే సహించేది లేదని అన్నారు. ఉక్కుకు సొంత గనులు కేటాయించాల్సింది పోయి ప్రైవేట్‌పరం చేసేందుకు కుట్రలు పన్నడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక కార్యకర్తలు, ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు పాలవెంకయ్య, అప్పలరాజు, సత్తిబాబు, ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మూడు పీఠాల పండగ



దివ్య సత్ ప్రసాదాన్ని అందిస్తున్న విశాఖ అగ్రపీఠాధిపతులు, చర్చి ఫాదర్లు

కంచరపాలెం: జ్ఞానాపురం పరిధి సెయింట్ పీటర్స్ పునీత పేతురు ప్రధాన దేవాలయంలో ఆదివారం మూడు పీఠాల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ అగ్రపీఠాధిపతులు (ఆర్చి బిషప్)డాక్టర్ మల్లవరపు ప్రకాశ్ భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీస్తు ప్రభువు ఇహలోకం నుంచి పరలోకానికి వెళ్లే సమయంలో తాను మానవాళి మధ్యలో సజీవంగా ఉండేందుకు గుర్తుగా రొట్టె, ద్రాక్ష రసాన్ని భుజించమని చెప్పారన్నారు. దివ్యపూజ బలిలో సత్ ప్రసాదంలో సాక్షాత్తు క్రీస్తు ప్రభు అంశ ఉంటుందన్నారు. పండగలో భాగంగా నూతనంగా దివ్య సత్ ప్రసాదాన్ని సుమారు 130 మంది చిన్నారులు స్వీకరించారు. అనంతరం జ్ఞానాపురంలోని వడిచర్లవీధి, స్లీవ్‌గుర్తు మండపం, పునీత పేతురు ప్రధాన దేవాలయంలో ఏర్పాటు చేసిన పీఠాల వద్ద దివ్య సత్ ప్రసాద ఆరాధన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి విచారణకర్తలు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్, పీపీసీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

స్నేహితునికి ఆపన్నహస్తం



ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన పత్రాలు, నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

డాబాగార్డెన్స్: నగరంలోని మహారాణిపేట సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి సబ్బవరపు దేముడుబాబు అనారోగ్య కారణాల (పక్షవాతం)తో మంచాన పట్టాడు. ఏ పనీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్న దేముడుబాబుకు పాఠశాల పూర్వ విద్యార్థులు దేముడుబాబు పాప పేరిట రూ.65 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, కుటుంబ పోషణకు మరో రూ. 6 వేలు ఆదివారం ఆయన స్వగృహానికి వెళ్లి అందజేశారు. అమెరికాలో ఉంటున్న కాశీ సుబ్రహ్మణ్యం, ఉర్లాపు ప్రవీణ్‌కుమార్‌తో పాటు బందారు శ్రీను, నాయుడు సేవా కార్యక్రమానికి సహాయం అందజేశారు.

సూర్యనారాయణమూర్తికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో ఉషా–ఛాయా సమేత శ్రీ సూర్యనారాయణమూర్తి



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టపై అలమేలు మంగమ్మ ఆలయంలో వెలసిన శ్రీ సూర్యనారాయణమూర్తి దేవాలయంలో మాఘమాసం నాల్గవ ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జాము నుంచే స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకులు పాణంగిపల్లి కేశవాచార్యులు ఆధ్వర్యంలో మూలవిరాట్టుకు ప్రత్యేకంగా గోక్షీరంతో అభిషేకం, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం మందార, చామంతి, గులాబి పుష్పాలతో స్వామి వారిని విశేషంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు.

హెల్మెట్ ధారణతో సురక్షిత ప్రయాణం



ట్రాఫిక్ పోలీసులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సత్యసాయి మహిళా యువజన విభాగం సభ్యులు



హెల్మెట్ ధరించని వారికి అవగాహన కల్పిస్తున్న మహిళా యువజన విభాగం సభ్యులు

సీతంపేట: సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ ధరించాలంటూ శ్రీసత్యసాయి మహిళా యువజన విభాగం సభ్యులు అవగాహన కల్పించారు. ఆదివారం అక్కయ్యపాలెం హైవే కూడలిలో ట్రాఫిక్ భద్రతపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఫోర్ట్‌టౌన్ ట్రాఫిక్ సీఐ షణ్ముకరావు ఆధ్వర్యంలో పోలీసులతో కలిసి ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ ధారణ ఆవశ్యకతను తెలియజేశారు. హైవే సిగ్నల్ పాయింట్ వద్ద హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారి వద్దకు వెళ్లి ప్లకార్డులు పట్టుకుని హెల్మెట్ ధరించడం వల్ల కలిగే మేలును వివరించారు. ప్రమాదాలు జరిగినపుడు ప్రాణాపాయం నుంచి హెల్మెట్ రక్షిస్తుందన్నారు. కార్యక్రమంలో ఫోర్ట్‌టౌన్ ట్రాఫిక్ ఎస్ఐలు గంగాధర్, వి.వాణిశ్రీ, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, సత్యసాయి సేవా సమితి మహిళా యూత్ కో ఆర్డినేటర్లు మల్లిక, సంగీత, నందిని, మహిళా యూత్ సభ్యులు, సమన్వయకర్త సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఔదార్యం



దహన సంస్కారాలకు ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: నియోజకవర్గ పరిధి పలు వార్డుల్లో అనారోగ్యంతో మంచాన పట్టిన పలువురికి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆర్థిక సాయం చేశారు. జీవీఎంసీ 34వ వార్డు నరహరి వీధిలో నివసిస్తున్న మల్లువలస శంకరరావు బ్రెయిన్‌స్ట్రోక్‌తో బాధపడుతున్నారని, మెరుగైన వైద్యం కోసం ఎదురు చూస్తున్నారని, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వార్డు నాయకులు, కార్యకర్తల ద్వారా తెలుసుకుని ఎమ్మెల్యే రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే అనారోగ్యంతో మృతి చెందిన భూపేష్‌నగర్ వ్యక్తి కుటుంబానికి దహన సంస్కారాల కోసం రూ.5వేలు అందజేశారు. తోట పద్మావతి, నాయకులు పాల్గొన్నారు.

రక్తదానంతో గురుభక్తి చాటుకున్న పూర్వ విద్యార్థులు



రక్తదాన శిబిరంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

డాబాగార్డెన్స్: సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయుడు ఫాదర్ జోజిబాబు మరణించి ఈనెల 15వ తేదీకి ఏడాది పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం పెద్ద ఎత్తున పాఠశాల ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఫాదర్ జోజిబాబు వద్ద విద్యనభ్యసించి విదేశాల్లో స్థిర పడిన వారు కొందరైతే.. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్నత పదవుల్లో ఉన్నారంటే అది జోజిబాబు తమకు అందించిన విద్య.. నేర్పిన క్రమశిక్షణేనని పేర్కొన్నారు. సేకరించిన రక్తాన్ని లైఫ్ షేర్ బ్లడ్‌బ్యాంక్‌కు అందజేశామన్నారు. ముందుగా రక్తదాన శిబిరాన్ని బిషప్ ఫాదర్ జయరాజు ప్రారంభించి పూర్వ విద్యార్థులను అభినందించారు. పూర్వ విద్యార్థి సంఘం ప్రతినిధులు కోండ్ర రామకృష్ణ, కాశీభట్ల స్వరూప్, సక్కెళ్ల త్రినాథ్, కిలాని గణేష్, సీనియర్ పాత్రికేయుడు ఎస్ఎస్ శివశంకర్, లైఫ్ షేడ్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ శిరీష, మేనేజర్ అరుణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

త్యాగరాజ స్వామికి పంచరత్న సేవ



పాల్గొన్న సంగీత విద్వాంసులు, విద్యార్థినులు

సీతంపేట: త్యాగరాజ స్వామి ఉత్సవాల్లో భాగంగా కార్తికేయ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఆదివారం బీవీకే కళాశాలలో పంచరత్న సేవ జరిగింది. ముఖ్య అతిథి ప్రముఖ గాత్ర విద్వాంసుడు మల్లాది శ్రీరామ్‌ప్రసాద్ వాగ్గేయకారుల గొప్పతనాన్ని వివరించారు. అనంతరం జగదానందకారక, దుడుకుగల, సాధించెనే, కనకనరుచిరా, ఎందరో మహానుభావులు పంచరత్న కృతులను సంగీత విద్వాంసులు, విద్యార్థులు కలిపి గానం చేశారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు త్యాగరాజ కృతులను ఆలపించారు. నిష్టల కృష్ణవేణి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్వాంసులు డాక్టర్ బి.కె.డి.ప్రసాద్, బండి శ్యామల, కాశీ ప్రసాద్, శంకరం పాల్గొన్నారు.

గంజాయి కేసులో మరో నలుగురి అరెస్ట్

బీచ్ రోడ్డు: బీచ్ రోడ్డులో అక్రమంగా గంజాయి విక్రయాలు చేపట్టిన వారికి గంజాయి సప్లయ్ చేస్తున్న నలుగురిని మూడో పట్టణ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి బీచ్‌రోడ్డులో అక్రమంగా గంజాయి విక్రయాలు చేస్తున్న ముగ్గురు ఏయూ సెక్యూరిటీ గార్డులను పోలీసులు అరెస్ట్ చేసి విచారించారు. తమకు ఆనందపురానికి చెందిన సాయి, గోవింద్, తూర్పు గోదావరికి చెందిన సంతోష్, శ్రీకాకుళానికి చెందిన సతీష్ గంజాయిని సప్లయ్ చేసినట్లు సెక్యూరిటీ గార్డులు తెలిపారు. దీంతో రంగంలోకి దిగిన మూడో పట్టణ పోలీసులు ఆ నలుగురిని కూడా అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

మత సామరస్యంతో శాంతిస్థాపన

సీతంపేట: ప్రపంచ శాంతిని కోరుతూ బి.వి.ఫౌండేషన్, ఫర్ ఫీస్ అండ్ హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్ దాస్ మాట్లాడుతూ సర్వమతాలు ఐక్యంగా ఉంటే శాంతి స్థాపన సాధ్యపడుతుందన్నారు. దేశభక్తి, కులం, మతం అనేవి పూర్తిగా వ్యక్తిగత విషయాలని, వివిధ మతాలకు చెందిన వారు కలిసి జీవించడం మన భరతజాతి సంస్కృతిగా పేర్కొన్నారు. ఆ విధంగా మన దేశం ఇతర దేశాలకు మార్గదర్శకమన్నారు. ఈ దశలో ఐఏఆర్ఎఫ్ కార్యక్రమాలు చురుగ్గా నిర్వహించడం అభినందనీయమన్నారు. శాంతి సంఘం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరాలని సమావేశంలో నిర్ణయించారు. ఇంటర్నేషనల్ కౌన్సిల్ సభ్యుడు నరవ ప్రకాశరావు మాట్లాడుతూ సంస్థ ఆశయాలను తెలుపుతూ మానవ హక్కుల పరిరక్షణకు సహకారం, మతపరమైన సంస్థలతో కలిసి సర్వమత సమైక్యతకు సమాజ సేవకు విస్తృతంగా కృషి చేస్తోందన్నారు. ముందుగా సర్వమత ప్రార్థనలు చేసి శాంతి కోసం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ ఎం.ఎస్.ఆలీ బైగ్, హరగోపాల్, డానియల్ రాజు, రాజేంద్రజైన్, బి.చిన్నారావు. ఎస్.కె.సాహు పాల్గొన్నారు.